క్లుప్తంగా

ఈ-పంట నమోదుపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణారెడ్డి

పొదిలి: రైతులు సాగు చేసిన ప్రతి ఎకరం ఈ-పంటలో నమోదు చేయాలని తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలు, గ్రామ వ్యవసాయ సహాయకులకు గురువారం శిక్షణ కార్యక్రమం ముగిసింది. తహసీల్దార్ మాట్లాడుతూ.. డిజిటల్ క్రాప్ సర్వే చేసిన ప్రతి భూకమతం ఫొటో తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రెవన్యూ గ్రామంలో డౌన్‌లోడ్ అయిన ప్రతి భూకమతాన్ని జియో ఫెన్సింగ్‌తో ఫీల్డ్ సర్వే చేసి ఫొటో తీయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాజిదా పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలి


మాట్లాడుతున్న గిద్దలూరు నియోజకవర్గ ఈఆర్‌ఓ శివరామిరెడ్డి

కొమరోలు: బీఎల్‌ఓలు తప్పులు లేని ఓటర్ల జాబితాను పారదర్శకంగా తయారు చేయాలని గిద్దలూరు నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి శివరామిరెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. బీఎల్‌ఓలకు 3 అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో 1200 మంది కంటే తక్కువగా ఓటర్లు ఉండేలా రేషనలైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటు హక్కు పొందే సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని తాటిచెర్ల మోటు సబ్‌స్టేషన్ పరిధిలోని తాటిచెర్ల, నాగిరెడ్డిపల్లె, హసనాపురం, ముత్రాసుపల్లె, దద్దవాడ, గుండ్రెడ్డిపల్లె, నారాయణపల్లె, అలసందలపల్లె, గోవిందపల్లె, పొట్టిపల్లె, అక్కపల్లె, వెంకటాంపల్లె, కంకరవానిపల్లె గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి, సిబ్బందికి సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొనకనమిట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ బ్రహ్మం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

పారిశుధ్యం డొల్ల

- నియోజకవర్గంలో అపరిశుభ్రంగా గ్రామాలు
- ఫాగింగ్, బ్లీచింగ్ చేయించడంలో పాలకుల నిర్లక్ష్యం
- విజృంభిస్తున్న దోమలు.. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- గ్రామాల్లో మురుగు తటాకాలను తలపిస్తున్న ప్రధాన రోడ్లు


జెన్నివారిపల్లెలో సీసీ రోడ్డుపై మురుగు


అక్కపల్లెలో మురుగు తటాకాన్ని తలపిస్తున్న మెయిన్ రోడ్డు

బేస్తవారిపేట:

వర్షాకాలం మొదలైంది. గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతోంది. మోస్తరు జల్లులకే ప్రధాన రహదారులు సైతం నీటితో నిండిపోయి రోజుల వ్యవధిలోనే మురుగు తటాకాలుగా మారుతున్నాయి. బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ చేయించడంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గ్రామాల్లో దారుణ పరిస్థితులు

బేస్తవారిపేట మండలంలోని అక్కపల్లె, పీవీపురం, పూసలపాడు, జెన్నివారిపల్లె గ్రామాల్లో అంతర్గత రోడ్లు మురుగుకూపాలుగా మారాయి. అక్కపల్లె గ్రామంలోని మెయిన్ రోడ్డుపై వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో లోతైన గుంత ఏర్పడి మురుగుమయంగా మారింది. కంభం మండలంలోని తురిమెళ్ల, మాదారుపల్లె, కందులాపురం, కంభంలోని ఎస్పీజీపాలెంలో మురుగు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. కొమరోలు మండలంలో సూరవారిపల్లె, నల్లగుంట్ల, కొమరోలు బీసీకాలనీ, శివాజీనగర్, రెడ్డినగర్, పురుషోత్తమునిపల్లె, కె.బొంతపల్లెలో ఇళ్ల, పరిసరాల్లో పేరుకుపోయిన మురుగు, చెత్తాచెదారం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. పట్టణాలతోపాటు గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండటమే ఈ పరిస్థితికి కారణం. బేస్తవారిపేట మండలం పూసలపాడులో సీసీ రోడ్డుపై మురుగు నిల్వ చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీఓ తాత్కాలికంగా కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయించడంతో పరిస్థితిలో కాస్త మార్పు వచ్చినా శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు. జ్వరాల బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని, గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నీటి ద్వారా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంది. అప్రమత్తంగా లేకపోతే డయేరియా, వాంతులు, రక్తంతో కూడిన జిగట విరేచనాలవుతాయి. తప్పనిసరిగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలి. జ్వరం వస్తే ఇష్టానుసారంగా మందులు వాడకుండా దగ్గరలోని పీహెచ్‌సీలో డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ చైతన్యదీపక్, గలిజేరుగుళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి


బేస్తవారిపేట : డ్రైనేజీ కాలువలో నిల్వ ఉన్న మురికినీరు

పేరెంట్స్ మీటింగుకు స్పందన కరువు


పీటీఎం నుంచి ఇంటిదారిపట్టిన విద్యార్థుల తల్లిదండ్రులు

మార్కాపురం/మార్కాపురం టౌన్: మార్కాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు తల్లిదండ్రుల నుంచి నామమాత్రపు స్పందనే వచ్చింది. తల్లిదండ్రులు పెద్దగా హాజరుకాకపోవడంతో హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు ఒకింత ఆందోళనకు గురైనప్పటికీ ఎక్కడా బయటపడకుండా విజయవంతమైందని చెప్పుకోవడం గమనార్హం. పీటీఎంను ప్రభుత్వం ఆర్భాటం కోసం నిర్వహించిందే తప్ప.. ఎక్కడా తల్లిదండ్రులు, టీచర్లకు మధ్య సంభాషణలు జరిగిన దాఖలాలు లేవు. కూటమి నాయకులు పీటీఎంను కాస్తా రాజకీయ సమావేశాలుగా మార్చారన్న విమర్శలు వెల్లువెత్తాయి.

సమావేశం కాసేపే..

మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని కాసేపటికే మమ అనిపించారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రసంగించి వెళ్లగానే తల్లిదండ్రులు ఇంటి బాట పట్టారు.

హాజరు నామమాత్రం

మార్కాపురం పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో 794 మంది విద్యార్థినులు ఉండగా 374 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 800 మందికిగాను 600 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు. మండల కేంద్రమైన తర్లుపాడు జెడ్పీ పాఠశాలలో 265 మంది విద్యార్థులు ఉండగా 155 మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. తుమ్మలచెరువు జెడ్పీ పాఠశాలలో 345 మంది ఉండగా 108 మంది, మీర్జపేట జెడ్పీ హైస్కూల్లో 223 మంది విద్యార్థులకుగాను 95 మంది, పోతలపాడులో 234 మందికిగాను 144 మంది, తాడివారిపల్లి జెడ్పీ పాఠశాలలో 263 మందికిగాను 91 మంది, కేజీబీవీలో 190 మంది విద్యార్థులకుగాను 86 మంది, పొదిలి మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్లో 350 మంది విద్యార్థులకుగాను 150 మంది, పొదిలి బాలుర ఉన్నత పాఠశాలలో 1050 మంది విద్యార్థులకుగాను 550 మంది తల్లిదండ్రులు, బాలికోన్నత పాఠశాలలో 540 మంది విద్యార్థులకుగాను 200 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మందికిగాను 150 మంది, కొనకనమిట్ల జెడ్పీ పాఠశాలలో 190 మందికిగాను 95 మంది, గొట్లగట్టు జెడ్పీ పాఠశాలలో 548 మందికిగాను 150 మంది, పెదారికట్ల జెడ్పీ పాఠశాలలో 280 మందికిగాను 90 మంది, చిన్నారికట్ల జెడ్పీ హైస్కూల్లో 130 మందికిగానూ 85 మంది, మర్రిపాలెం జెడ్పీ పాఠశాలలో 300 మందికిగాను 80 మంది, రేగడిపల్లి జెడ్పీ పాఠశాలలో 198 మందికిగాను 100 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే విద్యాభివృద్ధి


కొమరోలులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు

కొమరోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు, విద్యకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారని జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు పేర్కొన్నారు. గురువారం కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మనబడి నాడు–నేడు కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అమ్మ ఒడి పథకం అమలు చేయడం, నాణ్యమైన విద్య అందించేందుకు తీసుకున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలు వినియోగించుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తిరుపతిరాజు, మాజీ వైస్ ఎంపీపీ నాదెళ్ల పెద్దసుబ్బరాయుడు, ఎంఈఓ–2 బొర్రా వెంకటరత్నం, హెచ్‌ఎం శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించొద్దు


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ మాధవరావు

గిద్దలూరు రూరల్: వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మార్కాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మాధవరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గురువారం వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని స్పష్టం చేశారు. సరైన పత్రాలు లేని రెండు వాహనాలకు రూ.39,100 జరిమానా విధించారు. ఆయన వెంట రవాణా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



గిద్దలూరు : అవగాహన ర్యాలీలో న్యాయమూర్తులు, న్యాయవాదులు

గిద్దలూరు రూరల్: కక్షిదారులు మధ్యవర్తిత్వంపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.ఓంకార్ పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం నిర్వహించిన దేశం కోసం మధ్యవర్తిత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టు కేసులను సత్వరమే పరిష్కరించుకోవడం కోసం మధ్యవర్తిత్వం అంశాన్ని ఎంచుకోవాలని సూచించారు. ఇరు పార్టీలతో సమన్వయం ఏర్పరచడంలో మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులతో కిలోమీటరు నడక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి కె.భరత్‌చంద్ర, న్యాయవాదులు శేషయనారెడ్డి, సంగీరావు, భాస్కరరావు, హిమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

మార్కాపురం/పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కాపురం నియోజకవర్గంలో మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. మార్కాపురం మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా భవనంవెంకటరామిరెడ్డి, మహిళ విభాగానికి చుట్ల జయమ్మ, రైతు విభాగానికి సింగారెడ్డి పోతిరెడ్డి, బీసీ సెల్‌కు తాడిబోయిన రాజరావు, ఎస్సీ సెల్‌కు కె.చినబాబు, ఎస్టీ సెల్‌కు కుడుముల కాశయ్య, మైనార్టీ సెల్‌కు సయ్యద్ అల్లి సాహెబ్, క్రిస్టియన్ మైనార్టీ వింగ్‌కు బూదాల విక్టరీ బెంజిమెన్, స్టూడెంట్ వింగ్‌కు తుమ్మ మహేశ్వరరెడ్డి, పంచాయతీ వింగ్‌కు పొందుగుల శ్రీనివాసరెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు పెద్దిరెడి శేషిరెడ్డి, వలంటీర్స్ వింగ్‌కు పిన్నిక వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగానికి ఏరువ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ టీయూసీకి దుగ్గెంపూడి శివకుమార్, అంగన్‌వాడీ వింగ్‌కు షేక్ జాహీర్, కల్చరల్ వింగ్‌కు వెన్నా కృష్ణారెడ్డి, సోషల్ మీడియా వింగ్‌కు పగడాల కొండారెడ్డి, దివ్యాంగుల వింగ్‌కు ఎల్.శేఖర్, పబ్లిసిటీ వింగ్‌కు బూదాల గురవయ్యను నియమించారు.

పొదిలి నగర పంచాయతీలో..

యూత్ వింగ్‌కు ఎస్‌కే బాజీ, మహిళ విభాగానికి ఎస్‌కే షాహీదాబాను, రైతు విభాగానికి గుంటూరి పిచ్చిరెడ్డి, బీసీ సెల్‌కు పులిగొర్ల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్‌కు వేల్పుల సురేష్, ఎస్టీ సెల్‌కు దాసు కృష్ణ, మైనార్టీ సెల్‌కు రోటీ ఎస్దాన్, క్రిస్టియన్ మైనార్టీ వింగ్‌కు గాలిముట్టు ఏసోబు, స్టూడెంట్ వింగ్‌కు ఎ.నిహంత్ యాదవ్, మున్సిపాల్ వింగ్‌కు ఎస్‌కే మహబూబు బాషా, ఆర్టీఐ వింగ్‌కు పి.బాను ప్రసాద్, వలంటీర్సు వింగ్‌కు పయ్యావుల మహేష్, వాణిజ్య విభాగానికి కొత్తూరి శ్రీనివాసులు, వైఎస్సార్ టీయూసీకి పొదిలి ఏడుకొండలు, అంగన్‌వాడీ వింగ్‌కు కాటూరి లక్ష్మి, కల్చరల్ వింగ్‌కు పి.నాగేశ్వరరావు, సోషల్ మీడియా వింగ్‌కు మందగిరి రమేష్, దివ్యాంగుల వింగ్‌కు డి.ఆంజనేయులు, పబ్లిసిటీ వింగ్‌కు డేగ వెంకటరావును నియమించారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు


మార్కాపురంలో సాయి సత్యవ్రతాల్లో పాల్గొన్న భక్తులు


పొదిలిలో సాయినాథుడికి పూజలు


గిద్దలూరులో గాయత్రి యజ్ఞం నిర్వహిస్తున్న

సాక్షి నెట్‌వర్క్: గురుపౌర్ణమి వేడుకలను మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. బాబా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా మందిరంలో గత నెల రోజుల నుంచి గురుపౌర్ణమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సుమారు 25 వేల మంది భక్తులు బాబాను దర్శించుకున్నట్లు మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, జి.హరిహరరావు తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. కళాశాల రోడ్డులోని సత్సంగం మందిరంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఆర్.రామచంద్రరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో జగద్గురు రామానుజాచార్యులకు ప్రత్యేక పూజలు చేశారు.

- పొదిలి పట్టణంలో దర్శి రోడ్డులోని సాయిబాబా ఆలయం, విశ్వనాథపురంలోని బాబా మందిరం, కంభాలపాడులో వేడుకలు నిర్వహించారు. దాతల సహకారంతో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.
- గిద్దలూరు పట్టణంలోని పెద్ద మార్కెట్ వద్ద గల సాయిబాబా ఆలయంలో విశేష పూజలు చేశారు. కాశినాయన కుంట ఆవరణలోని గాయత్రి మాత ఆలయ ఆవరణలో గాయత్రి యజ్ఞం నిర్వహించారు. గాయత్రి యజ్ఞంతో సకల దోషాలు నశిస్తాయని రామకృష్ణ ధ్యాన మందిర నిర్వాహకుడు పి.హనుమంతారెడ్డి పేర్కొన్నారు.
- కొమరోలులోని రాజుగారికోటలో ఉన్న సాయి మందిరంలో 3 రోజులుగా గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి ప్రత్యేక పూజల అనంతరం అన్న సంతర్పణను ప్రారంభించారు.
- అర్ధవీడులోని షిర్డీ సాయి ఆలయంలో విశేష పూజలు, భజనలు నిర్వహించారు. మొహిద్దీన్‌పురం, నాగులవరంలో పూజల అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

వ్యసనాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిత


మాట్లాడుతున్న సీఐ జయరావు

గిద్దలూరు రూరల్: యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక జీవనజ్యోతి కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు–అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం అవుతాయని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.